క్లుప్తంగా

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకులంగా స్పందించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం మంత్రి పొన్నంను కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు లింగం,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల వివరాలు ఇవ్వాలని కమిషనర్‌కు వినతి


వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: మున్సిపాలిటీలో 2021 నుంచి 2022 వరకు చేపట్టిన పనులకు వివరాలు ఇవ్వాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ కల్లెడ సునీత మున్సిపల్ కమిషనర్ కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. చెత్త సేకరణకు వాహనాలకు ఖర్చు చేసిన డీజిల్, పెట్రోల్ బిల్లుల వివరాలు, పట్టణ ప్రగతిలో హరితహారం వివరాలు, ఖర్చు చేసిన బిల్లుల వివరాలు, టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి చెల్లించిన చెక్కుల వివరాలు, మియావాకీ నర్సరీలో వేసిన బోరు వివరాలు పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు కుర్మ మల్లారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ నాయకులు కోరారు. గావ్‌చలో–పల్లెకు పోదాం అభియాన్‌లో భాగంగా బుధవారం పెగడపల్లిలో బీజేపీ నాయకులు పీఎం మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బాబు, రాజేశం, గట్టన్న, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు


బ్యాగులు, సంచులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మల్లాపూర్: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెనుముప్పుగా మారుతోందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగులు, సంచులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు పొంచి ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ బదులుగా జనపనార, వస్త్ర, కాగితపు సంచులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు మోర సతీష్, పుప్పాల మహేశ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన న ఉపాధ్యాయులు ఆనంద్, లక్ష్మణ్, శివరంజని, రమాదేవిలను బుధవారం సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు అంగరి ప్రేమ్‌సాగర్, గడ్డం చిన్నారెడ్డి, హెచ్ఎంలు రాజయ్య, విష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై చిత్తశుద్ధి ఏది?

- 25 మంది పారిశుధ్య కార్మికుల తొలగింపు
- చెత్త సేకరణకు ఒకే ఒక్క ట్రాక్టర్
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు


మురికికాలువలో పేరుకుపోయిన చెత్త


రాయికల్ పట్టణమంతా చెత్తసేకరణకు ఉపయోగిస్తున్న ఒకే ఒక్క ట్రాక్టర్

రాయికల్: మున్సిపల్ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో పట్టణంలోని రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోతోంది. పారిశుధ్యం చేపట్టే కార్మికులను అధికారులు తొలగించడంతో పట్టణంలోని పలు వార్డుల్లో మురికికాలువల్లో చెత్త తీయకపోవడంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

రాయికల్ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ కోసం గతంలో 54 మంది కార్మికులు ఉండగా, జనవరి 12న 25 మంది కార్మికులను తొలగించారు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని 12 వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించాల్సిన కార్మికులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉన్న కార్మికులతోనే పనులు చేయిస్తున్నారు. చెత్త సేకరణ, నర్సరీల నిర్వహణ, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు వంటి పనులను కార్మికులు చేపట్టాల్సి ఉంది. పట్టణంలో 6–7 కి.మీ వరకు మురికి కాలువలు ఉండగా, సరిపడా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో మురికి కాలువల్లోంచి చెత్త తరలించక పోవడంతో దుర్వాసనతో ఇబ్బంద ులు పడుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

నిలిచిన పట్టణ ప్రగతి నిధులు.. కార్మికుల తొలగింపు

రాయికల్ వంటి చిన్న మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడంతో పారిశుధ్య కార్మికులకు అందించాల్సిన వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉండటంతో వారిని తొలగించారు. అంతేకాకుండా చెత్త సేకరణ కోసం గతంలో రెండు ట్రాక్టర్లు, ఆరు ఆటోలు, కొనుగోలు చేయగా ప్రస్తుత కేవలం ఒకే ఒక్క ట్రాక్టర్‌తో పట్టణమంతా తిప్పుతూ రోజుకు 2–3 వార్డుల చొప్పున చెత్తసేకరిస్తున్నారు. కాగా, రాయికల్ మున్సిపాలిటీలో ఇటీవల తొలగించిన కార్మికులను తీసుకునేందుకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించగా, కోరం లేక వాయిదా పడటంతో కార్మికులను మళ్లీ తీసుకోవడంలో జాప్యం ఎదురవుతోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి పారిశుధ్య కార్మికులను నియమించి పట్టణ ప్రగతి నిధులు విడుదల చేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది



రాయికల్ పట్టణంలోని చెత్త తొలగించకపోవడంతో, మురికికాలువల్లో సిల్ట్ తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. ముఖ్యంగా దోమల బెడద తీవ్రతరం కావడంతో మలేరియా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– గంగాధర్, రాయికల్ వాసి

కార్మికులను తీసుకుంటాం



పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తొలగించిన కార్మికులను పాలకమండలి అనుమతితో తీసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఉన్న సిబ్బందితో వార్డుల వారిగా చెత్తసేకరణ, మురికికాలువల్లో చెత్తను తొలగిస్తున్నాం. కోరం లేక వాయిదా పడటంతో జాప్యం ఎదురైంది.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

పశు సంపద పెంపునకు కృషి చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


విద్యార్థులకు మెమొంటో అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచేందుకు వెటర్నరీ విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు వెటర్నరీ పశువైద్య విశ్వ విద్యాలయం, జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కోరుట్ల ధర్మారం, మల్లాపూర్ మండలం గుండంపెల్లి గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. పశువైద్య విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచేందుకు కృషి చేయాలన్నారు. విశ్వ విద్యాలయం అసోసియేట్ డీన్ ఆచార్య మాధవరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ద్వారా రైతులకు అందిస్తున్న వివిధ సేవలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వేణు గోపాల్ రావు, పశువైద్య అధికారులు పున్నం దీరజ్, అశోక్, ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

మెట్‌పల్లిరూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు,స్థానిక నాయకులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో పర్యటించిన ఆయన డ్రైయినేజీ, రహదారుల సమస్యలను పలువురికి దృష్టికి తీసుకురాగా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిరెడ్డి, మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి, గ్రామ ప్రత్యేకధికారి రాజు,పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి చేయాలి


సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: గ్రామీణ ప్రాంత మహిళల అభ్యున్నతికి గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పల్లికొండ నరేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీవోఏల రివ్యూ, లోకోస్ శిక్షణ కార్యక్రమంలో పీడీ పాల్గొని మాట్లాడారు. మహిళలకు ఎక్కువ మొత్తంలో రుణాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. బ్యాంకు లింకేజీలో నూరు శాతం ప్రగతి సాధించిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవోలు సుధీర్, బాలె శివాజీ, డీపీఎం వెంకటేశ్, ఏపీఎంలు శంకర్, అశోక్, డీఎంజీ దాస్, సీసీఎస్‌లు, ఎంఎస్ స్టాఫ్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు


అల్లీపూర్‌లో రోడ్డు ఊడుస్తున్న అధికారులు


కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో ..

జగిత్యాలరూరల్/కథలాపూర్/మల్లాపూర్/కోరుట్ల రూరల్/రాయికల్/పెగడపల్లి/ధర్మపురి/సారంగాపూర్/బుగ్గారం: జిల్లావ్యాప్తంగా బుధవారం పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రాలు, అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది ర్యాలీలు చేపట్టారు. అనంతరం గ్రామపంచాయతీల్లో రోడ్లు, వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు,అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: కరాటేతో ఆత్మరక్షణతో పాటు, శారీరక దృఢత్వం పెంపొందుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణ ఖాజీపుర ఉర్దూ మీడియం స్కూల్ విద్యార్థులు కరీంనగర్‌లో జరిగిన ఇండో నేపాల్ కరాటే చాంపియన్‌షిప్‌లో అత్యధిక ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను ఈ సందర్భంగా అభినందిస్తూ కరాటేతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి విద్యలో సైతం రాణించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు జవేరియా బేగం, ప్రకాశ్, గంగారాం పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం


ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బుధవారం బీజేపీ నాయకులు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీ అరవింద్ హటావో బీజేపీ బచావో అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ బీజేపీ ని నాశనం చేయడమే ఏకైక ఎజెండాగా ఎంపీ పనిచేస్తున్నాడని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీగా గెలిచాక సీనియర్లకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలు, పార్టీ నాయకులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇతర పార్టీలకు అమ్ముడు పోయే వ్యక్తులకు టికెట్‌తో పాటు పార్టీ బాధ్యతలు అప్పగిస్తూ జగిత్యాలలో పార్టీని నాశనం చేస్తున్నాడని అరవింద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చీటి శేఖర్‌రావు, ఠాకూర్ విద్యాసింగ్, ఎడమల వెంకటరాజం,శ్రీకాంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, బాల్క సుమన్ దిష్టిబొమ్మల దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో గ్రామ ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్, బాల్క సుమన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంపై బాల్క సుమన్ దుర్భాషలాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోమారు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

ఇబ్రహీంపట్నం: సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాంపెల్లి వెంకటాద్రి డిమాండ్ చేశారు. మండలంలోని వేములకుర్తిలో బుధవారం మాట్లాడారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలు అతడి అహంకారానికి నిదర్శమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పకుంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మల రమేశ్, బుర్రి ముత్యం, రామనుజం, మాట్ల రవితేజ, బాస మనీష్, బుర్రి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సైబర్ డీఎస్పీ సురేశ్

రాయికల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ డీఎస్పీ సురేశ్ సూచించారు. రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఎవరికీ ఇవ్వొద్దని, అపరిచితులతో స్నేహం చేయరాదని, సైబర్ నేరాలకు గురైతే 1930 నంబరుకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్సై దినేశ్, ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో బుధవారం కోరుట్ల పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి సైబర్ మోసాలు, ట్రాఫిక్ రూల్స్, గంజాయిపై అవగాహన కల్పించారు. సైబర్ లింకులు పంపే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హరిప్రియ, ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రమాబాయికి నివాళి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో మాతా రమాబాయి జయంతి వేడుకలు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రమాబాయి త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్, గణేశ్, శివ, రవి, రఘు, రమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: దళిత వర్గాల అణిచివేతకు నిరసనగా తన ప్రాణ త్యాగం చేసిన మాత రమాబాయి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవన్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి ఆమె చిత్ర పటానికి పూలమాల లేసి నివాళి అర్పించారు. దళిత వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి పనిచేయాలి

మెట్‌పల్లి: బీఎస్పీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి అన్నారు. మెట్‌పల్లిలో బీఎస్పీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ కోరుట్ల నియోజకవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా భీమన్న, శ్రీధర్, అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా విక్రమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రశాంత్, కోశాధికారిగా కల్యాణ్‌లను నియమించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అమర్, నాయకులు పాల్గొన్నారు.

కళాశాలలో తీరిన తాగునీటి సమస్య

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు తాగునీటి ఇబ్బందులు బుధవారం తీరాయి. సారంగాపూర్ జూనియర్ కళాశాలలో 200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలల్లో తాగునీటి సమస్యను అధ్యాపకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్సీ స్పందించి బోరును వేయించారు. బోరు ఏర్పాటు విజయవంతం కావడంతో తాగునీటి సమస్య తొలగిందని ప్రిన్సిపాల్ నారాయణ, వైస్‌ప్రిన్సిపల్ కొంక వేణు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

మెపా జిల్లా అధ్యక్షుడిగా వంశీ

ఇబ్రహీంపట్నం: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంకు చెందిన పిట్టల వంశీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ బుధవారం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొజ్జ నర్సయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా నేమూరి నరేశ్ ముదిరాజ్, సంయుక్త కార్యదర్శులుగా బత్తిని కిషన్ , చొప్పరి శ్రీనివాస్, సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందజేత

ధర్మపురి: బుగ్గారం మండంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన బండారి చిన్న శాంతమ్మ, పెగడపెల్లి మండలంలోని వెంగలాయిపేటకు చెందిన ఆత్మకూరు స్వామి, గొల్లపెల్లి మండలం వెనుగుమట్లకు చెందిన పాదం శ్రీకాంత్ వివిధ కారణాలతో మృతి చెందగా, బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను మాజీ స్పీకర్ మధుసుధనాచారి, కొప్పుల ఈశ్వర్ బుధవారం అందించారు.

జిల్లాస్థాయి ప్రతిభాపాటవ పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాయికల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఉపన్యాసంలో బొడ్డుపల్లి రక్షిత (భూపతిపూర్), పాటల పోటీల్లో విద్యూష (కేజీబీవీ), పెయింటింగ్‌లో హంపి (బాలికల ఉన్నత పాఠశాల, రాయికల్), కవిత్వంలో లాస్యప్రియ (కేజీబీవీ)లు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, పొన్నం రమేశ్, బొల్లె చిన్నయ్య, రాపర్తి నర్సయ్య, పద్మ, చెరుకు మహేశ్వరశర్మ, విజయ్ పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాలు ఆవిష్కరణ

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16 న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మె కరపత్రాన్ని బుధవారం మున్సిపల్ కార్మికుల సమక్షంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా కార్మిక వర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఈ నెల 16 న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో రైతు కూలీలు, కార్మికులు, బీడీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, హమాలీలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎండీ ఉస్మాన్, చిట్యాల రాజ్ కుమార్, తెడ్డు సాయిలు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే పనులు సాధ్యం

జగిత్యాల: ఐక్యతతోనే గౌడ హక్కులను సాధించుకోవచ్చని జగిత్యాల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఎల్లమ్మతల్లి ఆలయంలో జాతీయ మాస పత్రికకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.గౌడ హక్కుల సాదన కోసం కరపత్రం తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, సత్తయ్య, తిరుపతిగౌడ్, రాజేశ్ పాల్గొన్నారు.

రాజారాంపల్లిలో నేడు ఉచిత వైద్యం శిబిరం

వెల్గటూర్ : ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఏలేటి రాజారాంపటేల్ జన్మదినం సందర్భంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శివకృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని ఎండపల్లి, వెల్గటూర్, ధర్మారం మండలాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పట్టణంలో చలో బస్తీ చలో అభియాన్

కోరుట్ల: పట్టణంలోని 25వ వార్డులో బీజేపీ నాయకులు బుధవారం చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పీసరి నర్సయ్య, బీజేపీ నాయకులు కలాల సాయి చంద్, శ్రీనివాస్, రమేశ్, రాజేశ్, నవీన్, జితేందర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

సారంగాపూర్: కరీంనగర్ దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజులపాటు మండల కేంద్రంలో మహిళలకు, యువతులకు కుట్టు శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి చేసిన వారికి బుధవారం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో రాజేందర్, సీడీపీవో వాణిశ్రీ, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ సునంద, పంచాయతీ కార్యదర్శి లైశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో సామగ్రి అమ్మకానికి వేలం

సారంగాపూర్: దుబ్బరాజన్న మహాశివరాత్రి జాతర బ్రహోత్సవాల్లో భాగంగా సామగ్రి అమ్మకానికి బుధవారం ఆలయ ఆవరణలో అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. కొబ్బరికాయలు, బెల్లం, పూజాసామగ్రి అమ్ముకునేందుకు రూ. 5.60 లక్షలు పలికింది. పూలు, పండ్లు అమ్ముకోవడానికి రూ. 16 వేలు, చెప్పుల స్టాండ్ నిర్వాహణకు రూ. 5 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, దేవాదాయ డివిజన్ పరిశీలకులు రంగు రవికిషన్, ఈవో అనూష, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు గడువు 21

మల్యాల: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ అభ్యర్థులు ఈ నెల 21లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ తెలిపారు. పరీక్ష ఫీజు ఈ నెల 12 నుంచి 21 వరకు ఎటువంటి అదనపు రుసుం లేకుండా, 22 నుంచి 27 వరకు రూ.50ల అపరాద రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. గతంలో ఫెయిల్ అయిన అభ్యర్థులు సైతం ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పాఠశాలలో వార్షికోత్సవం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం కోనరావుపేట ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం శివారులో బుధవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందింది. మండలంలోని కందెనకుంటకు చెందిన ఏదుల నర్సయ్య తనకు తాళ్లధర్మారం గ్రామ శివారుల్లో ఉన్న పొలం నాటు వేయడానికి వెళ్లాడు. నాటు పనులు జరుగుతుండగానే నర్సయ్యకు చెందిన ఎద్దు మేత కోసం ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా అక్కడి వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పరిశీలించి రైతుకు పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.